# కూపస్థమాండూక్యం

రిక్షా యజమానికి అప్పగించి తన గుడెసెకు బయలుదేరాడు పాపారావు. యజమాని ఒక గంట ఆలస్యంగా వచ్చావు అని బెదిరిస్తే రెండు అణాలు ఆయన చేతిలో పెట్టి బయటపడ్డాడు. రోజుకి అద్దెగాయిచ్చే రూపాయిన్నరకుతోడు యిది.

పాపారావుకి ఆ రోజు రెండున్నర రూపాయలు మిగిలినై. అతని సంతోషానికి మేరలేకుండావుంది. అతడు తన గ్రామంలో ఉన్నప్పుడు ఇంత డబ్బు యేనాడూ చూచిఎరగడు. రోజంతా పొలం చాకిరీచేస్తే మహావస్తే రూపాయివచ్చేది. అయితే సంవత్సరానికి ఆరునెలలు పనే వుండేదిగాదు. ఇక్కడ పనిలేకపోవడం అనే ప్రశ్నలేదు, ఓపికవుండాలిగాని.

అయితే అన్నానిదే అతనికి కొంచెం కష్టంగా వుంది కూరా నారా బాగానే వుంటుందిగాని, వారు నలుగురుకలిపి ఒక చిన్నగది అద్దెకు తీసుకొని వుంటున్నారు. నలుగురికి కాంతమ్మే వండిపెడుతూ వుంటుంది. కాంతమ్మకు దిక్కెవరూలేరు. పాతిక సంవత్సరాలకంటే వయస్సు ఎక్కువవుండదు. తమకు ఇంతవండి, తానింతతిని ఎక్కడికో వెళ్ళిపోతుంది మళ్ళీ వంటవేళకుగాని రాదు.

కాంతమ్మకు తనంటే యిష్టము. అందరికంటే ఒక మెతుకు తనకే ఎక్కువ పెడుతుంది. ఎవ్వరూ చూడకుండా కాస్తకూర ఎక్కువే వేస్తూ వుంటుంది. కాని ఒకరితో ఒకరికి పొత్తులేని నలుగురుకలిసి ఒక ఆడమనిషితో వండించుకొని తినటం అతనికి బాగుండలేదు. ఆమె ఎవరు తమకు వండిపెట్టటానికి? వండితే తల్లి వండాలి; లేకపోతే పెళ్ళాంవండాలి. ఈమెకూ తమకూ ఏమి సంబంధం అని ఈమెతో వడించుకోవటం?

అతని మనస్సుకి ఏమీ బాగుండలేదు, ఆమె అన్నం వడ్డించటానికి వచ్చినప్పుడల్లా పెళ్ళికూతురుకుమల్లే తల వంచుకు కూర్చునేవాడు మొదటి రోజుల్లో. నోటమాట పెగిలేదికాదు, ఆమె ఎగతాళికూడా చేసేది, "ఈకోన కోడిని ఎక్కడినుంచి పట్టుకువచ్చారు?" అని

"మేమూ మొదట్లో అట్టా వున్నోళ్ళమే. నాలుగురోజులు పోనీయ్ కోడి కూతకువ స్తదో లేదో నువ్వే చూద్దువుగాని" అనేవారు మిగిలిన ముగ్గురూ.

కాంతమ్మంటే మిగిలిన ముగ్గురికీ చనువే. ఆమెతో సరసాలాడే వారు. ఆమె ఊరుకునేదికాదు. ఎదురు తిరిగి వారు అన్నదానికంటే పది రెట్లు అనేది.

పాపారావుకి వాళ్ళ సంబంధం బొత్తిగా అర్థమయ్యేది కాదు. నాలుగు మెతుకులు కొరికి లేచిపోయి బయట పక్క వేసుకొని పడుకుని నిద్రపోయేవాడు.

ఒకరోజు అట్లాగే పడుకుంటే కాంతమ్మవచ్చి పరసన కూర్చుంది. అతనికి తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. నిద్రపోయినట్లు పడుకున్నాడు.

"ఏందయ్యో వొకటేనిద్దర, లే కాసేపు కబుర్లుచెప్పు" అని వీపు తట్టిలేపింది కాంతమ్మ.

అప్పటికీ లేవటానికి ఇష్టంలేక, వొకముూలుగు మూలిగి ముణగ దీసుకు పడుకున్నాడు పాపారావు.

"కోణంగిచేష్టలు చాలా వున్నయే" అని చక్కలిగింతలు పెట్టింది కాంతమ్మ.

పాపారావు ఏదైనా తట్టుకోగలడుగాని చక్కలిగింత తట్టుకోలేడు. గుక్కలుపట్టి నవ్వుతూ గిజగిజ తన్నుకున్నాడు.

"ఊరుకో, లేస్తా" అన్నాడు.

ఆమె వూరుకోలేదు.

"నీకు దణ్ణంపెడతా, ఊరుకో" అని ప్రాధేయపడ్డాడు.

అట్లా దారికిరా" అని వొదిలిపెట్టింది.

పాపారావు లేచి కూర్చున్నాడు. రొప్పుతూ, "ప్రాణాలు తీసేశావ్" అన్నాడు.

"ఇంత మాత్రానికే?" అని నవ్వింది కాంతమ్మ

నెమ్మదిగా కబుర్లలోకి దింపింది. అతని సంగతులన్నీ అడిగి తెలుసుకుంది

"సరేగాని నువ్వెక్కడనుంచి వొచ్చావ్?" అని అడిగాడు పాపారావు.

"ఆకాశాన్నుంచి."

"ఆకాశంలో వుండే చుక్కవా నువ్వు? గాలికి రాలిపడ్డావా?" అని పరియాచికం ఆడాడు పాపారావు

"అబ్బో చాలవరకుండే అబ్బాయి తెలివి!" అని ఆశ్చర్యం వెలిబుచ్చింది కాంతమ్మ.

"పోనీ చెప్పకపోతె చెప్పకపోయావు. వాళ్ళు నీకేమవుతారో చెప్పు."

"ఎవళ్ళు?"

"వాళ్ళ" అని దూరంగా పడుకున్న మిగిలిన ముగ్గురినీ చూపాడు పాపారావు.

"బావలు" అన్నది కాంతమ్మ

"మరి నేనేమవుతాను!"

"బుల్లిబావవి."

"ఛీ పో" అన్నాడు పాపారావు సిగ్గుతో తల వంచుకుంటూ.

"ఏం? నాకంటే మంచిమరదలు దొరుకుద్దా నీకు?"

"నాకు మరదలే వద్దు" అన్నాడు పాపారావు

"అదీ చూద్దాంగా ఎన్నాళ్ళో?" అన్నది కాంతమ్మ.

ఇద్దరూ కాసేపు మెదలకుండా కూర్చున్నారు. చివరికి పాపారావు ధైర్యంచేసి అడిగాడు. "మాకు అన్నాలుపెట్టి, నువ్వు యాడకు పోతావ్?"

"డిక్కీకి."

"ఊళ్ళో ఎవరున్నారు నీకు?"

"లక్షమంది బావలు" అన్నది కాంతమ్మ. పాపారావు బిగ్గరగా నవ్వాడు.

"ఏం? అన్ని వివరాలు అడుగుతుండావు? నన్నేమన్నా అదుపులో పెడతావా?"

"లేదులే, ఊరికినే అడగా!"

ఆమె సమాధానం చెప్పలేదు. కాసేపు ఇద్దరూ మెదలకుండా కూర్చున్నారు దూరంగా పడుకునివున్న ముగ్గురూ తననే చూస్తువున్నారని గ్రహించాడు పాపారావు. తనకుమల్లే వాళ్ళు పోట్టకోసం టౌనుకి వచ్చిన వాళ్లె అందులో వొకని పేరు శివయ్య చేతిబండిలాగుతూ వుంటాడు. రెండవ వాని పేరు వెంకన్న. అతను తనకుమల్లేనే రిక్షాలాగుతూ వుంటాడు. మూడవవాని పేరు ముసలయ్య. కూరగాయలు లాట్లు లాట్లుగా కొని తోపుడు బండిమీద వూరంతా తిప్పి అమ్ముతూ వుంటాడు.

వాళ్ళందరూ తనంటే ఇష్టంగానే వుంటారు. కాని వుండి వుండి వొకరోజు ఏం పుండు పుడుతుందో; సూటిపోటీ మాటలు అంటూవుంటారు అది మామూలుగా కాంతమ్మ తనతో వొంటరిగా మాట్లాడినరోజు అయి వుంటుంది. తాను కాంతమ్మతో మాట్లాడడం వాళ్ళకు కోపం అని గ్రహించాడు పాపారావు. ఎందుకు వాళ్ళకి అనవసరంగా కోపం తెప్పించటం? అని కాంతమ్మకి వొంటరిగా కనపడకుండా తప్పుకు తిరుగుతుండేవాడు.

"ఏమిటి ఆలోచిస్తుండావు?" అని అడిగింది

"అళ్లు మననే చూస్తున్నారు" అన్నాడు పాపారావు

"ఏడవనీ" అంది కాంతమ్మ.

అతని కొంచెం ధైర్యం వొచ్చింది. "నువ్వు యాడపుట్టావు? ఈడకి ఎందుకు వొచ్చావు? సమస్తారంగా చెప్పు" అని అడిగాడు.

"నీను మల్లేనే పుట్టా, నీకు మల్లెన్నే వొచ్చా."

"ఎసవసలుపోక ఉన్నది ఉన్నట్టు చెప్పు."

అతడు గట్టిగా అడిగే టప్పటికి 'ఎంతచెడ్డా మొగాడు మొగాడే అనుకొని చిరునవ్వు నవ్వుకుంది కాంతమ్మ

తన ఊరు పేరు చెప్పింది. మొగుడ్ని విడిచిపెట్టి వచ్చానని చెప్పింది. శోభనాద్రి అనే కుట్టుమిషన్ పనిచేసే అతను వాళ్ళఊళ్లో వుండే వాడట. అతనితో లేచి వచ్చి వేసిందట.

"మొగుడ్ని ఎందుకు విడిచిపెట్టావు?" అని అడిగాడు పాపారావు "కాటేవాడా?"

ఆమె నవ్వి. "నీ తెలివి తగలడ్డట్టే వుంది" అన్నది.

"ఏం?"

కొట్టే మొగుళ్ని యే ఆడదన్నా ఇడిసిపెడుతుందటయ్యా?" అని అడిగింది.

పాపారావుకు అర్థంకాలేదు మామూలుగా విడిచిపెట్టబడ్డ మొగుళ్ళు మంచివాళ్ళుగానే వుంటారనే సంగతి అతనికి జ్ఞాపకం వొచ్చింది, తన స్వగ్రామంలో చిన్నయ్య అనే వొక రైతు వుండేవాడు. అతను చాలా మంచివాడు, ఎవర్నీ పల్లెత్తుమాటైనా అనేవాడుకాదు. అతని భార్య లేచి పోయింది. ఎవ్వరితో? తాడూ బొంగరంలేని వొక తాగుబోతుతో! అయినా కాంతమ్మ యవ్వారం యింకా వివరంగా తెలుసుకోవాలనుకున్నాడు.

"మరెందు లేచిపోయావ్?" అని అడిగాడు.

"అతను వొట్టిమొద్దు. పొద్దున్నే చద్దిబువ్వతిని పొలం పనికిపోయే వాడు. మళ్ళీ పొద్దుగూకినాక తిరిగొచ్చేవాడు. యిన్ని వేన్నీళ్ళు పోసుకుని అన్నంతిని పడుకొని నిద్రపోయేవాడు. ఏ యేటికో కోటికో నేను మొద్దు నిద్దర్లో వున్నప్పుడు వచ్చి నాకాలు గిరేవాడు."

కాలుగిరే విధానానికి అతనికి నవ్వొచ్చింది, బిగ్గరగా నవ్వాడు.

అందరూ అంతేలే!" అన్నది కాంతమ్మ చిరునవ్వు ఆపుకుంటూ.

"ఆ సంగతి నీకెప్పుడు తెలిసింది?"

"టౌనుకి వచ్చినాక."

"నేను యెప్పుడన్నా నీ కాలు గిరానా? అందరూ అంతేలే అంటు న్నావు గానీ!" అని అడుగుదాం అనుకున్నాడు పాపారావు. సిగ్గువేసి మాట మార్చాడు.

"ఇప్పుడు యాడ వుంటున్నాడు?"

"ఎవడు!"

"ఆ కుట్టుమిషన్‌వాడు" అన్నాడు. పాపారావు. ఎందుకో గాని ఆ కుట్టుమిషన్ వాడిమీద తనకు కోపంగా వుందని గ్రహించాడు పాపారావు.

"మరొకదాన్ని పెట్టుకొని యీడనే వున్నాడు."

"ఈడకు తీసుకువచ్చి నిన్ను ఇడిసిపెట్టివేశాడా."

ఈ ప్రశ్నకు కాంతమ్మ స్వాతిశయం దెబ్బతిన్నది. "ఆడిని నేనే ఇడిసిపెట్టా" అన్నది కోపంగా.

"కాదు ఆడే నిన్ను యిడిసిపెట్టాడు. నాకు తెలుసు." అన్నాడు పాపారావు.

"నీకెట్లా తెలుసు? నువ్వు యెవర్నన్నా యిడిసిపెట్టావా?"

"ఇడిసి పెట్టినోళ్ళని చూశా! లేపుకురావటం, ఇడిసిపెట్టటం అదే ఆళ్ళ పని"

"అబ్బో, పెపంచకం అంతా తనిఖీచేసి నోడికి మల్లే మాట్లాడుతుంటవే!" అన్నది కాంతమ్మ. అతని మాటలకు ఆమె లోలోపల మురిసింది.

"ఆ మిషనోడి దగ్గర్నుంచి యీడకు వొచ్చావన్నమాట!"

"మద్దెన వొకకాడ మకాంచేస్తినే!" అన్నది.

"యాడ?"

టౌన్లో సైకిలుషాపు పెట్టుకున్నాడే ఈరయ్య; ఆడికాడ."

పాపారావుకి జ్ఞాపకం వొచ్చింది ఆ షాపు. ఒకసారి నాకు సైకిల్ కావలసివస్తే కాంతమ్మ అక్కడ ఇప్పించింది. అతను అద్దె తీసుకోకుండానే ఇచ్చాడు. ఎందుకు యిచ్చిందీ. అప్పుడు తనకు అర్థంకాలేదు.

సైకిలుయిచ్చి "ఎక్కడాకనపట్టంలేదేమే కాంతమ్మా" అని అడిగాడు.

"కనపడాల్సిన కర్మ నాకేంపట్టే?" అన్నది కాంతమ్మ.

"కొత్త పిట్టని ఎక్కడో పట్టివట్టున్నావే?" అన్నాడు తన వంకకు చూస్తూ.

"కాలువ గట్టుమీద" అన్నది కాంతమ్మ.

"ఒకసారి కనపడు" అన్నాడు వీరయ్య స్వరం తగ్గించి,

"తీరిక వుంటే జూస్తాలే" అన్నది కాంతమ్మ.

ఇదంతా జ్ఞాపకంవొచ్చి "అడినీ నువ్వే యిడిసిపెట్టావా? అని అడిగాడు పాపారావు.

"నిజంచెబితే మాత్రం నమ్ముతావు గనకనా!" అన్నది కాంతమ్మ.

"నమ్ముతాలే"

"నేనే యిడిసి పెట్టా."

"ఎందుకు?"

ఆమె ఒక్కక్షణం ఆలోచించి "ఏందో అనుకుంటాంగాని అబ్బాయి ఈ మొగాళ్ళంతా ఒక్కటే, పదిరోజులు ఆళ్ళతో కాపరంచేస్తే ఆళ్ళ మొహం చూడబుద్ధి అవదు" అన్నది. ఇదివరకుమల్లే నవ్వులాటకు కాకుండా యీసారి సీరియస్‌గా చెప్పింది. పైకి ఆమె అవాకులు, చెవాకులు పేలుతున్నా లోపల చాలా బాధపడుతూ ఉన్నట్టు పాపారావుకి సైతం గోచరించింది.

టౌన్‌కి వచ్చినాక మళ్ళీ మీవూరు ఎప్పుడన్నా వెళ్ళావా"

"ఎళ్ళలా."

"అతనెప్పుడన్నా కనిపించాడా?"

"ఎవడు?"

"ఆ కాలుగీరేవాడు"

ఆ మాటకు గుక్కలుబట్టి నవ్వింది కాంతమ్మ. "ఒట్టప్పుడుకాపడి మొద్దునిద్దరపోనిచ్చి అప్పుడు గీరేవాడు వాడి జిమ్మడ" అని విరగదు. నవ్వింది.

"మొత్తానికి గట్టోడివే" అని ఒక ప్రశంసాపత్రం పారవేసింది.

"యింతకీ అతను కనిపించాడో లేదో చెప్పలేదు" అన్నాడు పాపారావు

కనిపించకే? నెలకొకతూరయినా కనిపిస్తా ఉంటాడు"

"ఏమంటాడు?"

"నన్ను యింటికి రమ్మంటాడు మొదట్లో నన్ను చూసినప్పుడు అతగాడికి నన్ను గుర్తు పట్టటమే కష్టం అయింది. 'వూళ్లో అందరూ నువ్వు చెడిపోయావని అంటుంటే నిజమే అనుకున్నా. నీకేం? బంగారం లాగున్నావు. వాళ్ళుకూడా చేశావు' అన్నాడు మొద్దుచచ్చినాడు"

"ఈ మద్దెన ఎప్పుడన్నా కనబడ్డాడా?"

"నిన్నకాక మొన్నేగా కనపడ్డది. నెలకోసారి ఏదో ఒక పనిమీద వస్తాడు. నేను కనపడేదాకా కాలవ వంతెనమీద కూర్చుంటాడు. చూసిగాని ఎళ్ళడు.

"ఏమన్నాడు?"

"మామూలుపాటే. 'నువ్వు యెళ్ళిందగ్గర్నుంచీ తిండికూడా సరిగా అమరటంలేదే, కూడు ఉడకేసి పెట్టేవాళ్ళు కూడా లేక మొహం వాచి చస్తున్నాను. రావే' అన్నాడు."

"పోనీ ఎల్లగూడదూ!"

"నే చచ్చినా ఎళ్ళను."

"ఎందుకనేం" అని రెట్టించి అడిగాడు పాపారావు.

"నీ కెందుకయ్యా యీ ఆడోళ్ళ సంగతులన్నీ?" అని కసిరింది కాంతమ్మ. కసరటానికి కసిరిందిగాని వెంటనే పశ్చాత్తాప పడింది.

"అతగాడు నాకు కనిపిస్తే కాలు గిరవాద్దని చెపుతాలే వెళ్ళు" అన్నాడు పాపారావు.

"గిరినా మేలుకొని ఉన్నప్పుడు గిరమను" అన్నది కాంతమ్మ చెంగు నోటికి అడ్డుపెట్టుకొని నవ్వుతూ,

"నిజంగా నువ్వు మీ ఊరు వెడితేనే బాగుంటుంది కాంతమ్మా" అన్నాడు పాపారావు నవ్వులు ఆగిన పిమ్మట.

నాకూ ఎళదామనే ఉందయ్యా. ఆ ముసలాడిని చూసినప్పుడల్లా ఎక్కడలేని జాలీ ముంచుకొస్తుంది. అతగాడు అడిగేదల్లా ఇంతముద్ద ఉడకేసి పెట్టమనేగందా. అడ్డమైనోళ్ళకీ ఉడికేసి పెట్టంగాలేంది, కట్టుకున్నోడికి ఆడికి ఉడకేసి పెట్టటానికేం? కాని నాకు ఆ ఊళ్లో యేమీ తోచదయ్యా. ఎళ్ళినా మళ్ళీ నాలుగురోజుల్లో తిరిగి రావలసిందే. ఎళ్ళటం ఎందుకు? రావటం ఎందుకు? ఆ ముసలోడి పుండుమీద కారం జల్లినట్లేగా అయ్యేది! అందుకని నేను ఎళ్ళనే ఎళ్ళను." అన్నది.

ఇక అప్పటికి ఆ సంగతి ఆపేశాడు పాపారావు. కాని కాంతమ్మ సుఖపడాలంటే మొగుడి దగ్గరకు వెళ్లటంకంటే వేరుమార్గం లేదని నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు కాకపోయినా యెప్పటికయినా తన మాట వింటుందనే ధైర్యం కూడా అతనికి కలిగింది.

ఇక్కడ యెవ్వరున్నారు ఆమెకు? వంట్లో సత్తువ ఉన్నన్నాళ్లూ ఆ పనీ ఈ పనీ చేయించుకొని ఇంత ముద్దపెడాతారు. తరువాత ఆమె ఎవరికి కావాలి? కుళ్ళిన టొమాటోను విసిరి పారవేసినట్లు ఏ చెత్తగుట్టమీదకో విసిరి పారవేస్తారు.

అన్నికంటే ఇంతమంది మొగాళ్లను చూచినపిదప కాంతమ్మకు మిగిలింది మొగుడిమీద యిష్టమే అని గ్రహించాడు పాపారావు. అందుకని వాళ్లని కలపాలనుకున్నాడు.

పాపారావు ఆలోచనలను కొంతవరకు కనిపెట్టింది కాంతమ్మ "నా గొడవ నీ కెందుకయ్యా? పడుకొని నిద్రపో. ఆలస్యం అయితే పేకువ జామున లెగవ్వు. రిక్షా లాగటంకూడా కష్టం అవుతుంది. మరి నేను యెళ్లొస్తా" అని లేచింది.

"ఎక్కడకు పో. ఇప్పుడు?" అని అడిగాడు పాపారావు.

"ఏట్లోకి" అని సమాధానం చెప్పింది కాంతమ్మ. ఆమె ఈ మాట నవ్వుతూనే అన్నా నిజమే, చెప్పిందనిపించింది పాపారావుకి. మాట్లాడక వూరుకున్నాడు.

కాస్త దూరంలో పండుకొని వాళ్లని గమనిస్తున్న వాళ్ళలో ఒకడి పేరు శివయ్య అని చెప్పాను. అతను చేతిబండి లాగుతూ వుంటాడని కూడా చెప్పాను. అతణ్ని పిలిచింది కాంతమ్మ, "ఓ పెద్దబావా! నన్ను సాగనంపుదువుగాని రా" అని.

"ఎక్కడికే? అత్తోరింటికా?" అని పరియాచకమాడాడు శివయ్య.

"అత్తోరింటికి పంపే అంత ముదనష్టపు వాడివీనూ నువ్వు" అన్నది కాంతమ్మ.

"మరెక్కడికే?"

"తాటితోపుదాకా పంపొద్దువుగాని. అక్కడ వుండే దెయ్యాలని చూస్తే నాకు భయం బావా!" అన్నది కాంతమ్మ.

"సరిపో. మరదలుపిల్ల మాట యినకపోతే నోట్లోకి మెతుకు దూరదు" అని లేచి, పక్కకు వేసుకున్న పైపంచ దులుపుకొని, తలకు చుట్టుకొని బయలుదేరాడు శివయ్య.

ఇద్దరూ చీకట్లో కలిసిపోయారు.

పాపారావు ఆలోచిస్తూ పడుకున్నాడు. అతను టౌనుకి వచ్చి యింకా నెలరోజులన్నా కాలేదు. అంతా కొత్తగావుంది. రిక్షా లాగటం యింకా అతనికి అభిమానంగానేవుంటూవుంది. నిగ్గదీసి డబ్బు అడగటం చేతగావటంలేదు. అయినా యింతవరకూ పది రూపాయలు మిగిల్చి స్వగ్రామంలో ఉన్న తల్లికి పంపాడు.

డబ్బు అయితే సంపాదిస్తున్నాడు గాని దానితోపాటు మనస్సులో ఆరాటం పెరుగుతూవుంది. టౌన్లో ఎవరినీ నా వాళ్లు అనుకోటానికి వీలు లేదు. ఎవరిని నమ్మడానికీ వీలులేదు. వీలుదొరికితే అందరూ అరదికొట్టే వాళ్ళే.

ఇటువంటివేళ కాంతమ్మవంటి ఆడమనిషి ఇన్నాళ్లూ బ్రతకటమే అతనికి చోద్యంగా కనిపించింది, ఆమెమీద అమితమైన జాలి కలిగింది. ఆ రోజు మొదలుకొని వారిద్దరిమధ్యా ఇతరులకు అర్ధంకాని ఒక సంబంధం ఏర్పడి వుంది.

* * *

ఆ రోజు రిక్షా, యజమానికి అప్పగించి ఇంటికి వచ్చేటప్పటికి కాంతమ్మ నేలమీద పడుకొని వుంది. శివయ్య ఇంకా ఇంటికి వచ్చినట్లు లేదు. మిగిలిన ఇద్దరూ తిండితిని బయట చాపలు పరుచుకొని పడుకొని ఉన్నారు.

"అన్నం పెడతావా కాంతమ్మా?" అని అడిగాడు.

"పెట్టుకు తినవయ్యా" అన్నది కాంతమ్మ.

అతనికి కష్టంవేసింది. తను వచ్చేదాకా యెదురుచూస్తు కూర్చొని దాగానే అన్నం పెట్టేది. తనకు అన్నం పెట్టటం తనకుసరదాగా వుండేది, తాను అన్నం తింటుంటే ఎదురుగా కూర్చొని ఆరోజు వూళ్ళో జరిగిన సంగతులన్నీ చెప్పేది. ఆ చచ్చినాడు కలిశాడు అనేది. అడిగితే ఏ చచ్చినాడో చెప్పేది. ఆ కథంతా యేకరువు పెట్టేది. ఇవాళ యెందుకు యింత సాచాతగా వుంది?

"ఒంట్లో బాగాలేదా?"

"బాగాలేదయ్యా"

అతను వెళ్ళి కుండలో అన్నం పళ్ళెంలోకి పెట్టుకున్నాడు పిడతలో వంకాయపచ్చడి వుంది ఇంకా ఏమన్నా చేసిందేమోనని వెతికాడు.

"ఇవాళ యేమీ చెయ్యవీలుపడలేదు" అన్నది కాంతమ్మ కండ్లు తెరవకుండానే.

పచ్చడి కలుపుకుతిన్నాడు, ఒక గ్లాసుడు మంచినీళ్ళు గటగట తాగేశాడు.

"చల్ల ఉట్టిమీద ఉన్నయి" అని నీరసంగా చెప్పింది కాంతమ్మ. మజ్జిగ పోసుకొని రెండు ముద్దలు తిని లేచాడు పాపారావు.

"అప్పుడే లేచావేం?"

"తిన్నాను"

"ఇవాళ ఒక్క కూరన్నా వండిపెట్టలేకపోయాను" అని విచారించింది కాంతమ్మ.

"దానికేంగాని, ఏందంట ఈ వంట్లో జబ్బు?"

"ఏమీలేదు"

"చెప్పవా?"

కాసేపు ఆలోచించి "నీతో చెప్పేదికాదులే" అన్నది కాంతమ్మ.

"మరెవ్వరితో చెపుతావ్? నీ పెద్ద బావతోనా?"

కాంతమ్మ కాసేపు ఆలోచించింది, ఆ దీపపు వెలుగులో అతని ముఖకవళికలు చూడటానికి ప్రయత్నించింది. అతనికి కోపంవచ్చి అన్న మాటగాలేదు– "ఆడికెందుకు చెప్పటం!"అన్నది"అర్చేవాడా. తీర్చేవాడా?"

ఆమెకు తెలియకుండానే, ఆమె కంఠంలో కన్నీరు పలికింది. ఆమె యీ జీవితంలో అనుభవించిన బాధలన్నీ ఆ ధ్వనిలో పాపారావుకి వినిపించినై అంతకుముందు ఏ తలనొప్పో, కాలునొప్పో అనుకొని తూస్కారిత చాడు. ఇప్పుడు అట్లా అనిపించలేదు. ఆమెకు దగ్గరగా కూర్చొని, "పోనీ వైద్యుణ్ని తీసుకొస్తా" అన్నాడు.

"మందులకు తగే జబ్బు కాదులేవయ్యా" అని యీసడించి వేసింది కాంతమ్మ. "నీ కెందుకు? నువ్వెళ్ళి పడుకో" అన్నది.

అతను కాసేపు ఊరుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు నిలచినై. ఇలా అన్నాడు–

"నీకు జబ్బుగా వుంటే నా మనసు బాగా లేదు కాంతమ్మా. నాకు

నిద్దరకూడా పట్టదు. ఇలాంటి జబ్బుని చెపితే నీ సొమ్మేం పోయింది? ఇవ్వాళ నేను రెండున్నర రూపాయలు సంపాదించాను. నీతో చెబితే సంతోషిస్తావుగందా అని గబగబా వచ్చాను. నువ్వు ముసుగేసుకు పడుకున్నావు. జబ్బేమిటంటే చెప్పవు ఇది నీకేమన్నా బాధగా ఉందా కాంతమ్మా.

పాపారావు మనస్సును చీల్చుకొని వచ్చిన ఈ మాటలకు కాంతమ్మ ఊగిపోయింది. సంఘంలో వున్న బటాచోరు లందరినీ తృణీకరిస్తూ తిరిగేటట్టు చేసినశక్తి ఆ క్షణం ఏమయిందో! కన్నీరు వోడికలు కట్టేట్టు ఏడ్చింది. మినుకుమినుకుమంటూ వెలుగుతున్న ఆ కిరసనాయిలు దీపం పాపారావునుంచి ఆమె కన్నీటిని దాచింది. ఆమె మనస్సులో ఏదో నిర్ధారణ చేసుకొని చీరె చెరుగుతో కన్నీరు తుడుచుకొని లేచి కూర్చుంది.

"ఏడుస్తున్నావా కాంతమ్మా?" అని అడిగాడు పాపారావు.

"లేదయ్యా."

"పోనీ చెప్పకపోతే చెప్పకపోయావులే...."

"చెప్ప గూడదని కాదయ్యా."

"మరెందుకంట?"

"ఇప్పుడు నా కొచ్చింది ఆడోళ్ళజబ్బు."

"ఏం దది?"

"నాకు నెల తప్పిందయ్యా."

ఒక్కక్షణం పాపారావుకి ఏమీ తోచలేదు. ఈ నెల తప్పడం అనేమాట సంతోషంగా చెప్పినవాళ్ళను అతను ఎరుగును. ఆడమనిషి నోట ఈ మాట ఇంత బాధగా వినటం అతనికి ఇదే మొదటిసారి. వెంటనే ఆమె బాధకు కారణం అతనికి తట్టింది.

"ఎవరు? ఎవరు? కాంతమ్మా?" అని ప్రాణాలు బిగ బట్టి అడగినట్లు అడిగాడు.

"ఎట్లా చెప్పేది!" అన్నది కాంతమ్మ.

అతనికి ఆమె పరిచయస్తులందరూ వొక్కసారిగా జ్ఞాపకం వొచ్చారు. "సైకిల్‌షాపు యీరయ్యా?" అని అడిగాడు.

"అవ్వొచ్చు" అన్నది కాంతమ్మ.

"పెద్దబావ శివయ్యా?"

ఆమె వొక్క పెద్ద నిట్టూర్పు విడిచి, "అవ్వొచ్చు" అన్నది. ఇక అతను అడగలేకపోయాడు. అతి ప్రయత్నం మీద మనస్సును సర్దుకున్నాడు. "అయిందేదో అయింది కాంతమ్మా. దీనికి నువ్విట్లా దిగులుపడి కూర్చోటం ఎందుకు? అని అడిగాడు.

"నీకు తెలియదు లేవయ్యా."

"ఏంది!" విసుగ్గా అడిగాడు.

"నీ బిడ్డ అయ్య ఎవరంటే ఏం చెప్పేది! బిడ్డని ఎట్లా పెంచేది! బిడ పెరిగి 'నా అయ్య ఎవరంటే ఏం చెప్పేదీ!" అని ఆక్రోశంగా అడిగింది, తన కష్టాలకన్నీ అతనే బాధ్యుడు అన్నట్లు.

పాపారావుకి ఒక కొత్త చూపు వడింది. మనసు తొలిచింది, కొన్ని సమస్యలు ప్రారంభం అయినప్పుడు నామ మాత్రంగా ఉండి క్రమక్రమేణా భయంకరయావం తాలుస్తాయి. అందుకని ఈ కొత్త చూపు బలపడినకొద్దీ భయం వేసింది. తాను స్వగ్రామంలో ఉన్నప్పుడు ఎవరో రోజుల పసిగుడ్డుని గొంతుపిసికి పొదలో పారవెయ్యటం చూశాడు. ఇంకా పొత్తిగుడ్డలు ఆ బిడచుట్టూ ఉండనే ఉన్నయి. ఏదో సినిమాలో పెరిగిన కొడుకు నా తండ్రిపేరు చెప్పమని తల్లిని బాధించటం చూశాడు. ఒక తల్లి ఇతరుల పాపం బయటపడకముందే కాలువలోదూకి ప్రాణాలు తీసుకోవటం విన్నాడు.

అతనికి ముచ్చెమటలు పోసినై. "మరి ఇప్పుడేం చేస్తావ్?" అని అడిగాడు కాంతమ్మని.

అతని కంగారుచూచి, "ఏదో ఒకటి చేస్తాలేవయ్యా" అన్నది కాంతమ్మ.

అంతటితో అతను వొదిలి పెట్టలేదు. "నాకు చెప్పాలి" అని భీష్మించుకొని కూర్చున్నాడు.

"ఒక గిద్దెడు పసరు పుచ్చుకుంటే సరిపోయేది అన్నది.

"ఒద్దు" అన్నాడు పాపారావు.

"ఏం?"

"అయ్యన్నీ మోటు మందులు. తల్లికి కాళ్ళూ, చేతులూ పడొచ్చు. ప్రాణాలమీదకు రావొచ్చు. అంతకీ ఆ బిడ్డ అయ్యపేరు చెప్పాల్సొస్తే నా పేరు చెప్పు."

"నీ కేం సంబంధం?"

"నిన్నెరిగుంటమే సంబంధం."

"సరేలే, నువ్వెళ్ళిపడుకో"

"ఆ మోటు పనులకు దిగవద్దు."

"నీతో చెప్పకుండా ఏపని చెయనుగానీ. నా మాటవిని నువ్వెళ్ళి పడుకో."

పాపారావు చాపతీసుకొని బయటకు వెళ్ళాడు. అతనిని వెళ్ళనిచ్చి ఆపుర్న ఏడ్చింది కాంతమ్మ. ఆమెకు జీవితంలో ఇంతవరకు పాపారావు వంటిమనిషి తగల్లేదు. మగవాళ్ళంతా మోసగాళ్ళే అనుకుంది. తన దగ్గరకు వచ్చే మగవాళ్ళంతా ఒకే కోర్కెతో వస్తారనుకుంది. అందుకనే మగ వాళ్ళవట్ల నిరసన భావం పెంచుకొని ఇన్నాళ్లూ బ్రతికింది ఆ నిరసనభావమే ఇనాళ్లూ ఆమెకు అధారంగా ఉండి బ్రతుకును నడిపింది. ఇప్పుడది ఒక్క దెబ్బతో తుత్తునియలైంది, ఈ పాపారావు తనకు ఎవరు? తననుంచి కోరేది ఏమిటి? ఏమలేదు. అయినప్పుడు తనంటే అతనికి ఎందుకు ఇష్టం?

తను మొయ్యవలసిన నిందను అతను మొయ్యటానికి సిద్ధపడ్డాడు. ఇంతకు ముందు తను ఎరగని జీవిత లక్షణం ఏదో తన అనుభవంలోకి వస్తు న్నట్లనిపించింది కాంతమ్మకి. అలాగే పడుకుని నిద్రపోయింది.

* * *

ఆ నాటినుంచీ కాంతమ్మ తన సంగతి ఆలోచించటం మానివేసింది. ఆమెకు గర్భిణీ అవి మిగిలినముగ్గురికీ తెలిసింది. ఆమెను లేకుండా చూచి, ఎగతాళిగా మాట్లాడుకుంటూవుండేవారు, వారి మాటలు వినలేక, "ఆ కలగబోయేది నా బిడ్డే అని చెప్పాడు పాపారావు.

"అనగానే సరిపోయిందీ" అన్నాడు శివయ్య.

శివయ్య ఆ మాట అనేటప్పటికి యెక్కడలేని కోపం వచ్చింది పాపారావుకి. "ఆవిడ మనకు అన్నం వండిపెడతావుంది. అందుగ్గాను ఆవిడ సంగతులు ఎత్తవలసినపని మనలో యెవ్వరికీ వుండరాదు అల్లావుంటే మనకు కుదురుతుంది. లేకపోతే యెవరిదారినవాళ్ళు పోవలసిందే" అన్నాడు.

ఆ మాటతో మిగిలినవాళ్ళు భయపడి వూరుకున్నారు. భయం యెందుకంటే అక్కడ అసలు వుడకేసి పెట్టేవాళ్ళు అసలు దొరకరు. కాంతమ్మముందు ఒక ఆడమనిషిని మాట్లాడుకుంటే ఆమె వుడకెయ్య టానికి యిచ్చిన వస్తువులు ఇంటికి జేరవెయ్యటం మొదలుపెట్టింది.

ఈ కారణంవల్ల వాళ్ళు పైకి ఏమీ అనటంలేదుగాని వాళ్ళ అయి ష్టాన్ని రకరకాలుగా బయట పెడుతూనే వొచ్చారు. కాంతమ్మ బాధ్యతను తీసుకోవటం వాళ్ళల్లో వొక్కళ్ళకీ ఇష్టంలేదు కాని పాపారావు కాంతమ్మ తన సొంతం అయినట్లు మాట్లాడుతుంటే, వాళ్ళకి ఒళ్ళుమండేది. ఏ కూర వండటంమీదో, పచ్చడి నూరటంమీదో వంకపెట్టి తమ అక్కసు వెళ్ళబోసు కొనేవాళ్ళు.

"వచ్చట్లో ఇయాళ మిరపకాయలే వేసినట్లులేవేం కాంతమ్మా!" అనేవాళ్ళు.

"కూరలో కాస్త కరేపాకుకూడా ఏస్తే బాగుండేది" అనేవాళ్ళు.

"ఇవాళ అన్నం తోషచేశావేం? అనేవాళ్ళు.

"అసలు నీ మనసు యిక్కడవుంటేగా!" అనేవాళ్ళు.

వెనక అయితే మాటకు పదిమాటలు అనేది కాంతమ్మ అప్పుడు ఎవళ్ళేమన్నా నవ్వుతూ ఊరుకునేది.

"నీళ్ళాడడానికి ఆస్పిటాలికి తీసుకెళతాడటగా పాపారావు" అని అడిగాడు శివయ్య ఒకరోజు యెకసెక్కెంగా.

"అసలాడు ఎదవైతే ఎవడో ఒకడు తీసుకెళతాడు"

"అయితే నేనే సంటావా"

"ఛీ నోరుముయ్" అన్నది కాంతమ్మ.

"మరి గత్తే పుట్టబోయే బిడ్డ నా బిడ్డ అంటాడే పావడు?" అన్నాడు.

అతనితో యిక మాట్లాడి ప్రయోజనం లేదని మెదలకుండా ఊరుకుంది కాంతమ్మ.

"ఎట్లా అయితే ఏంగాని కొడుకైతేమాత్రం నా పేరు పెట్టుకో మరదలుపిల్లా" అన్నాడు శివయ్య.

ఇట్లా వీలు దొరికినప్పుడల్లా ఏదో ఒక విధంగా ఆమెను బాధించటం మొదలుపెట్టారు. ఆమె ఈ విషయాలేవీ పాపారావుకి తెలియనిచ్చేది కాదు.

జరిగిపోతున్నయ్ రోజులు. కాంతమ్మ వంటకూడ చెయ్యలేని స్థితికివచ్చింది. ఆ పనికూడ తనమీదే వేసుకున్నాడు పాపారావు. పొద్దున్న అన్నంవండి రిక్షా తీసుకువెళ్లేవాడు. సాయంకాలం అయిదు గంటలకల్లా

ఒచ్చేసి వంటకు కూర్చునేవాడు. మొదట్లో పాపారావు వంట చెయ్యటానికి ఆమె ఒప్పుకోలేదు.

"యెందుకయ్యా నీ కీ కష్టం."

"ఇందులో కష్టం ఏముంది కాంతమ్మా? టౌనుకొచ్చిన కొత్తలో కొన్నాళ్ళు నేనే వండుకుతినలా! నాకేం కొత్తగనకనా?"

"నిన్ను చూచి నీతోటి వాళ్ళంతా నవ్వుతున్నారు"

"నవ్వనీ, వాళ్ళపళ్ళే బయటపడతై."

"నువ్వీయ్యన్నీ పెట్టుకు కూచున్నావు. సగానికి సగం కూడా సంపాదనలేకుండా పోయింది?

"ఇంకెన్నాళ్ళులే. నువ్వు నీళ్ళోసుకున్నాక ఇంతకుముందు సంపాదించినదానికి మూడురెట్లు సంపాదించలేకపోతే నాపేరు మారుపేరున పిలువు"

"నువ్వు ఇంటికి డబ్బు పంపించి ఎన్నాళ్ళయిందో గాపకం ఉందా! ఇంటిదగ్గరోళ్ళు ఏమనుకుంటారు?"

అది నిజమే. ఈ మధ్య పాపారావు తల్లి ఉత్తరం కూడా వ్రాయించింది. గడవటమే కష్టంగా ఉంది అన్నది. ఆమె విషయం తలుచుకున్నప్పుడల్లా మనస్సుకి దిగులుగానే ఉంటుంది. కాని ఏం చేసేట్టు! ఏ కొద్దిగా పంపుదామన్నా డబ్బు మిగలటంలేదు.

"మాట్లాడ వేమయ్యా!"

"నిన్నే పంపాను కాంతమ్మా" అని అబద్ధం ఆడాడు పాపారావు.

"నీ సంపాదన నాకు తెలియదా ఎట్టా? ఎక్కడనుంచి పంపావు?"

"ఒక స్నేహితుడి దగ్గర అప్పుచేసి పంపా."

"ఆ అప్పెట్టా తీరుస్తావు?"

"రెక్కలకష్టంమీద" అన్నాడు పొయ్యిమీద ఎసరు పెడుతూ.

"ఏమోనయ్యా నీ సంగతి నాకేం బాగాలేదు. నీ సంగతి నువ్వు చూచుకోవు. నా మానాన నన్ను పోనివ్వవు" అని కన్నీరు పెట్టుకుంది కాంతమ్మ.

పాపారావు మనస్సు కలుక్కుమన్నది. "ఇంతకు ముందు ఎంత కష్టమొచ్చినా తూస్కారించేదానివి. ఇప్పుడెందుకు మాటమాటకీ అట్లా కంటతడి పెట్టుకుంటావు? నీ కొచ్చిన కష్టమేందో చెప్పు?"

కాంతమ్మ తమాయించుకొని "కష్టం లేకేనయ్యా" అని చిరునవ్వు నవ్వింది.

చీకటిగదిలో అకస్మాత్తుగా దీపం వెలిగినట్లయింది అతనికి.

"అది సరేగాని, ఇట్లావచ్చి నా పక్కనకూచో."

"ఎందుకంట?" అన్నాడు పాపారావు సిగ్గుపడుతూ.

"ఒక మాట చెపుతా."

"ఇక్కడికి ఇనవడుతుందిలే చెప్పు."

"కూచోమంటూవుంటే?" అని గద్దించింది కాంతమ్మ.

నెమ్మదిగావెళ్ళి ఆమె సరసన కూర్చున్నాడు పాపారావు.

"నిన్నెందుకు ఆ వెంకన్నతో పోట్లాడావంట!"

"నీకెట్లా తెలిసింది?"

"ముసలయ్య అన్నాడు."

పోట్లాటకు కారణం చెప్పటం ఇష్టంలేక మెదలకుండా వూరుకున్నాడు పాపారావు.

"నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు లేవయ్యా?"

"తెలిస్తే నువ్వే చెప్పు."

'నన్నేదో అన్నాడని ఆడితో పోట్లాడావు."

"తప్పా?"

"తప్పో వొప్పో, ఆడసలే కష్టమనిషి. ఆడితో పెట్టుకోకు."

"ఆడికి నువ్వంటే ఎందుకు అంతకోపం?" అని ఉన్నవాడు ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడిగాడు.

"నేనంటే అందరికీ కోపమే."

"ఈడికెందుకూ అంట."

"ఆడికి వుండే కారణం ఆడికివుంది."

"ఏం దది?"

ఒకప్పుడైతే చెప్పపోకనేమో! ఇప్పుడామె చాలా బలహీనంగా వుంది. పైగా చేసినపనులన్నీ అతనికి చెప్పివెయ్యాలనే కోర్కెతో వుంది. అందుకని చెప్పింది.

"ఒకసారి ఆడు వరుసగా మూడురోజులు రిక్షా అద్దె యజమానికి కట్టలేదయ్యా. వచ్చింది, వచ్చినట్టు తాగేశాడు. రిక్షా యజమాని డబ్బు కట్టందే రిక్షా ఇవ్వనన్నాడు ఇవ్వాల్సిన డబ్బుకి పోలీసోళ్ళకి రిపోర్టుచేస్తానన్నాడు. ఆడికి పోలీసోళ్ళంటే చచ్చేభయం. ఆపాట్నవచ్చి నా కాళ్ళమీద పడి బతిమాలాడు. నాకు జాలేసింది. యజమాని ఇంటికివెళ్ళి నెమ్మదిగా తీర్చుకుంటాడనిచెప్పి రిక్షా ఇప్పించా. అప్పటినుంచి ఆడికి నామీద కోపం. మొదటిరోజుల్లో అసలు నాతో మాట్లాడేవాడేకాదు."

"నువ్వెళ్ళి అడిగితే యజమాని వొప్పుకున్నాడా?" అని అడిగాడు పాపారావు ఆమెవైపు చూడకుండా.

"ఎందుకోసం వొప్పుకోడు?"

"అతడికీ డబ్బుకీ లంకె గందా."

"మనిషికి ఒక దప్పేకాదయ్యో కావల్సినయి, ఇంకా చాలావుంటై. అంతకుముందు ఒకరోజు నాకు కబురెట్టాడు. నేను వెళ్ళలేదు. నా అంత నేనే వెళ్ళేటప్పటికి మురిసి చచ్చాడు."

పాపారావు కడుపులో ఎవ్వరో చెయ్యిపట్టి దేవినట్లయింది.

"ఈ సంగతి ఆడికి తెలుసా?"

"ముందేతెలుసు. తెలిసే నన్నెళ్ళమని బతిమాలాడు."

"ఈసారి ఆడు కనపడితే కాళ్లూ చేతులూ ఇరగ్గొట్టి పారేస్తా."

"అటువంటిపనే చెయ్యొద్దట" అన్నది కాంతమ్మ కోపంగా.

"ఇక్కడివాళ్ళతో నువ్వు ఎవ్వరితో పోట్లాడినా నేనిక్కడ వుండను. నా దారిన నేను పోతా."

"ఎక్కడికి పోతావ్?"

"ఏం? నాకు కట్టుకున్న మొగుడు లేనట్లు మాట్లాడుతున్నావ్? ఆడి దగ్గరకుపోతా?"

అంత కోపంలోనూ ఆమె మాటలకు నవ్వొచ్చింది పాపారావుకి. "ఆడేమో నిన్ను మొద్దునిద్దర పోనిచ్చి కాలు గిరతాడు" అన్నాడు.

ఆమె అతని కళ్ళల్లోకి బలహీనంగా చూచి నవ్వింది. ఒక్కక్షణం కండ్లు తళుక్కున మెరిసినై. ఆ తళుకు ముఖానికంతా వ్యాపించింది. "నిన్ను చూచినప్పుడల్లా నాకు బతకాలని అనిపిస్తుందయ్యా" అన్నది.

"బతక్కేంచేస్తావ్?" అన్నాడతను గట్టిగా తనను చుట్టుముడుతున్న భయాన్ని పోగొట్టుకునేందుకు.

ఆమె మాట్లాడలేదు. కళ్ళల్లో అంతకుముందు మెరిసిన తళుకు ఇట్టే ఆరిపోయింది.

"నువ్వు చక్కగా నీళ్ళోసుకో. నిన్నూ నీబిడ్డనీ తీసుకువెళ్ళి నేనే అప్పగించివస్తా."

"నన్నయితే నేను ఎప్పుడెళ్ళినా ఏలతాడు. ఈబిడ్డ నాకెందుకంటే?"

"తీసుకొచ్చి నేనే పెంచుకుంటాను."

"ఆ మాటన్నావ్ బాగుంది" తృప్తిగా, ప్రశాంతంగా నవ్వుకుంది తనలో తాను.

"ఒకమాట, మళ్ళీ మరచిపోతానేమో ఇప్పుడే చెప్పేస్తా."

"ఏందది?" అని ఆప్యాయతగా అడిగాడు పాపారావు.

"నన్నొదలి వొచ్చేటప్పుడు కాలుగిరొద్దని చెప్పు ఆడికి. గిరితే మేలుకున్నప్పుడే గిరమను."

"అట్లాగే" అన్నాడు పాపారావు విరగబడి నవ్వుతూ.

* * *

ఒకరోజు కాంతమ్మకు జ్వరం వచ్చింది. జ్వరం కొద్దిపాటిదే కాని ఎంత బ్రతుకుదామని ప్రయత్నించినా ఆమెకు బ్రతకబుద్ధి అవటంలేదు. బ్రతకాలని కోరుకోవటం ఆమెకు చేతగావటంలేదు. బ్రతకాలనే ఆపేక్షకు ఆధారమైనదేదో ఆమెలో తెగిపోయినట్టు అనిపిస్తూవుంది ఆమెకే.

"వైద్యుణ్ణి పిలుచుకొస్తాను" అన్నాడు పాపారావు.

"దేనికి వైద్యుడు? రేపటికి అదే తగ్గిపోతుంది" అన్నది కాంతమ్మ.

కాదు గూడదని అతడు మొండికేసి కూర్చున్నాడు.

"డబ్బెక్కడ తెస్తావయ్యా" అని అడిగిందామె.

"డబ్బుదేముంది? ఇంటి వెనకవున్న నల్లకుక్కను కొడితే వొస్తుంది" అన్నాడతడు.

ఇక ఆమె అతనిని వారించలేదు. సాయంకాలం అయ్యేటప్పటికి ఎట్లాలేదన్నా వొక్క అయిదురూపాయిలన్నా సంపాదించాలనే సంకల్పంతో బయలుదేరాడు పాపారావు. యజమాని ఇంటికివెళ్ళి రిక్షాతీసుకొని బజారుకి వెళ్తూ వెళ్తూ కాంతమ్మని ఒకసారి చూచిపోదామని వెళ్ళాడు.

ఇంటిముందు పోలీసు వున్నాడు. అతనితో శివయ్యా, యెంకన్నా ఏదో మాట్లాడుతూ ఉండటం చూశాడు పాపారావు. గబగబా సరాసరి ఇంట్లోకి వెళ్ళాడు. ఆ పోలీసు తన్నంత తీక్షణంగా ఎందుకు చూస్తున్నాడో అతనికి అర్థం కాలేదు.

కాంతమ్మ చాప పరచుకొని పడుకొని ఉంది.

"ఎట్లా ఉంది?"

"తేలిగ్గానే ఉంది."

ఆమె మొహం చూస్తే నిజంగానే తేలిగ్గా ఉందనిపించిందతనికి.

"ఇంకా ఎళ్ళకుండా ఈడే కూర్చున్నావేం?" అని అడిగింది.

"ఎళ్తూ ఎళ్తూ యెట్లావున్నావో చూచిపోదామని వచ్చా."

"నాకే యిబ్బంది లేదయ్యా. నువ్వు పని పాడుచేసుకోమాక."

"బయటవున్న ఆ పోలీసు యెవడు?"

"నాకు జబ్బుగా వుందని ఎవరో చెపితే జూసిపోదామని వచ్చాడు."

"నువ్వు ఎరుగుదువా?"

"ఎరక్కేం? నాలుగుబజార్లూ కలిసేచోట చేతులు లూపుకుంటూ నిలబడతాడు. అతడ్ని ఎవ్వ రెరుగరు?"

"మంచోడేనా?"

"మంచోడే! ఈళ్ళు చేసేపనులకి అతను ఉండబట్టి సరిపోయింది. ఈళ్ళమీద నేను ఎన్ని కేసులు తప్పించాను! అతను మంచోడు కాకపోతే ఈపాటికి ఈళ్ళంతా జైల్లో మడ్డికూడు తింటూవుండేవాళ్ళే."

ఇంకా ఏదో అడుగుదాం అనుకున్నాడు పాపారావు, అడగబుద్ధి పుట్టలేదు.

"సరే నే పోతున్నా" అని బయలుదేరాడు

"తొరగా రా" అన్నది.

"ఎందుకే—" అన్నట్టు చూశాడు పాపారావు.

"ఏంలేదు. ఎందుకోగాని, నీకు ఒక్కసారి చక్కలిగింతలు పెట్టాలని వుంది."

అతనికి మొదటిరోజులు జ్ఞాపకం వచ్చినై. తరువాత ఆమె ఒకటి రెండుసార్లు చక్కలిగింతలు పెట్టబోయింది. గాని అతను అందకుండా తప్పించుకొని పారిపోయాడు. ఇవ్వాళ తప్పించుకోలేదు.

"అట్లాగే పెడుదువుగాని, తొందరగానే వస్తా" అని చెప్పి బయలుదేరాడు.

బయట పోలీసులేదు. ఎవ్వరూ లేరు. ఎవ్వరి పనిమీద వారు వెళ్ళిపోయారు అనుకున్నాడు పాపారావు. అయిదురూపాయలు సంపాదించి వైద్యుణ్ణి తీసుకురావాలనే ధృఢ సంకల్పంతో రిక్షా బర్రున తొక్కుకుపోయాడు.

ఎంతడబ్బు ఇస్తానన్నా సరే ఒక్క మనిషిని కూడా జారిపోనివ్వకుండా రిక్షకట్టాడు. తాను మామూలుగా వెళ్ళని సందు గొందుల్లోకి కట్టాడు. హైదరాబాద్‌లో కొండగుట్టలు ఎక్కువ. అందుకని ఎత్తు ప్రదేశం మీదకు రిక్షా కట్టమంటే ఎంత ఇస్తానన్నా జంకేవాడు. వాళ్ళు ఎక్కువ ఇచ్చేమాట నిజమేగాని ఇక ఆవాళ రిక్షా తొక్కలేకపోయేవాడు. మొత్తానికి గుండెలు బ్రద్దలు కొట్టుకోవటమే తప్ప సంపాదన ఒక్కటే అయ్యేది. ఇవ్వాళ అతను ఇవన్నీ ఆలోచించలేదు. అతనికి కావలసిందల్లా అయిదు రూపాయలు. రేపేమైనా ఇబ్బందిలేదు. ఎక్కడికి పడితే, అక్కడికి, ఎంతకు పడితే అంతకు రిక్షా తొక్కాడు. అతనికి అదృష్టంకూడా కలసి వచ్చింది. బాడుగలు కుప్పలు కుప్పలుగా దొరికినై. పొద్దున అన్నానికికూడా వెళ్ళలేదు. గుక్కెడు నీళ్ళుకూడా ముట్టలేదు. ఒక్కక్షణం తీరుపోకుండా, తొక్కినవాడు తొక్కినట్లే వున్నాడు.

సాయంకాలం అయ్యేటప్పటికి నాలుగు రూపాయలు చేపట్టాడు. ఇక దొరకాల్సింది రూపాయి, వొక్క రూపాయే. 'దాని తాతగాడికి అచ్చి

వున్నానా? అదే దొరుకుతుంది' అనుకున్నాడు. అతను అనుకున్నట్టుగానే మినిష్టర్లతో పనివున్న వొక పెద్దమనిషి కొండమీదకు రిక్షా కడితే పది అణాలు ఇస్తానన్నాడు. ఇక కావలసింది అరణాలు. మినిష్టర్ల దగ్గరకు వెళ్ళి పెద్దమనిషి రిక్షా దిగగానే, మినిష్టర్లతో పనైయిపోయి వస్తున్న మరొక పెద్ద మనిషి నారాయణగూడాకి అరణాలు ఇస్తానన్నాడు పాపారావుకి ఇంకా కావలసిందేముంది? పైగా అతను వుండేది చిక్కడపల్లిలోనే. అది నారాయణగూడాకు ఒక ఫర్లాంగుకూడా వుండదు. ఆ పెద్దమనిషిని దింపి సరాసరి ఇంటికి వెళ్ళిపోవచ్చుననుకున్నాడు. దారిలోనే ఒక వైద్యుడు కూడా వున్నాడు. వెళ్ళేటప్పుడు ఆయన్ని వెంటబెట్టుకొని తీసుకు వెళ్ళవచ్చుననుకున్నాడు. అరణాలకు వొప్పుకున్నాడు.

ఆ పెద్దమనిషి రిక్షా ఎక్కాడు. రిక్షా జంయిన వెళ్ళిపోతూ వుంది. పాపారావు సంతోషం పట్టలేని పరిస్థితుల్లో వున్నాడు పొద్దున్నించీ అన్నం లేదేమో; వొళ్ళు తూలిపోతూ వుంది. కండ్లు బయిర్లు కమ్ముతున్నట్లనిపించింది. కాని వాటిని పట్టించుకునే స్థితిలోలేదు పాపారావు. ఎంత తొందరగా వెళ్ళటానికి వీలుంటే అంత తొందరగా వెళ్ళటమే అతని పని.

రిక్షా నారాయణగూడా జేరింది. ఇంకెంత రెండు ఫర్లాంగులు అనుకున్నాడు వేగం హెచ్చించాడు. రిక్షాలో కూర్చున్న మనిషికి కాస్త ఎండదెబ్బ తగిలినట్లుంది. లేకపోతే మినిష్టరు దగ్గరకు వెళ్ళినపని కాలేదేమో సొమ్మసిల్లి జేరగిలబడి కూర్చున్నాడు రిక్షాలో.

ఆగమేఘాలమీద వెళ్తున్న పాపారావుకి నాలుగు బజార్ల మధ్య పోలీసు నిలబడి వుండటం కనపడింది. కాంతమ్మ చెప్పినట్లు అతను క్షణం తీరికలేకుండా చేతులు వూపుతూ నిలబడివున్నాడు అతను. ఇంటి దగ్గర తాను చూచిన పోలీసే అనిపించింది పాపారావుకి. తనను తీక్షణంగా చూస్తున్నట్లే అనిపించింది. తల తిరుగనారంభించింది. ఎదురుగా కారు వస్తుంటే తప్పుకుందాం అనుకున్నాడు. తప్పుకున్నానే అనుకున్నాడు కాని తప్పుకోలేదు. కారు రిక్షాకు గుద్దుకుంది. రిక్షా విరిగి కూలపడింది.

కథా నిలయం 181 శ్రీకాకుళం

అతనికి ఒక్క విషయమే జ్ఞాపకం ఉంది. ఆ కారు నల్లగా చీంబోతు లాగుంది. అతనికి అసహ్యం వేసింది.

అతనికి స్పృహ వచ్చేటప్పటికి పోలీసుస్టేషన్లో వున్నాడు. అతనిని లాకప్‌లో ఉంచారు రిక్షా విరిగింది. అంతే, ఎవ్వరికీ పెద్ద దెబ్బలు తగ లేదు. రిక్షాలో కూచున్నాయన తుంటి మాత్రం కొద్దిగా జారింది. పాపారావుని వారం రోజులు జైల్లో ఉంచారు. ఆ వారం రోజులూ కాంతమ్మని తలచు కొని కన్నీరు పెట్టుకున్నాడు. తనకోసం ఎవ్వరన్నా వస్తారేమో అని చూశాడు. రాలేదు. ఆ వారం రోజులూ కంటిమీద కునుకు లేదు. చిక్కి శల్యం అయిపోయాడు బొద్దు తడుముకుంటే తను సంపాదించిన డబ్బు డబ్బుగానే ఉంది. నాలుగు రూపాయిల పదణాలు అయిదు రూపాయలు అవటానికి ఇంకా ఆరణాలు తక్కువ. ఆపుర్నా ఏడ్చాడు. అక్కడ అతని గోడు వినిపించుకునేది ఎవ్వరు?

ఏడోరోజు అతన్ని జైలునుంచి విడిచిపెట్టారు. అతడు రంయిన ఇంటికి బయలుదేరాడు. ఈపాటికి కాంతమ్మ జబ్బునయమయ్యే ఉంటుం దనుకున్నాడు. నయం కాకపోతే మాత్రం ఏం? తాను వెళుతున్నాడు గదా? ఇక ఆమెకు ఏ ప్రమాదమూ ఉండదు.

అతను ఇంటికి చేరుకునేటప్పటికి తనుండే ఇంటిచుట్టూ చుట్టు ప్రక్కలవుండే అలగాజలం పోగయివున్నారు. జనాన్ని చూస్తే ఏదో జరిగిందని భయం వేసింది పాపారావుకి. జనాన్ని తోసుకుని ఇంట్లోకి సొర చేపల్లే, చురకత్తల్లే వెళ్ళాడు వెళ్ళిన వాడు వెళ్ళినట్లుగానే నివ్వెరపోయి నిలబడిపోయాడు.

లోపలకు అడుగుపెట్టగానే అతనికి వినబడింది పసిపిల్లవాడు కేరు మనడం. అతని కంటబడింది కాంతమ్మ శవం. ఆ శవం చాపమీద పరచ బడివుంది. నిండా గుడ్డ కప్పబడి ఉంది. అతనికి అంతా అర్థమయింది. నెమ్మదిగా వెళ్ళి ముఖంమీద గుడ్డతీసి చూశాడు. ఆ ముఖం చాలా ప్రశాం

తంగా ఉంది. జీవితాన్ని హాయిగా వెళ్లమార్చుకొని గాఢనిద్రలో మునిగి నట్లుంది.

"నాలుగు రోజులయింది ప్రసవించి. అప్పుడు స్పృహ తప్పటం కన్ను మూసేవరకూ మళ్ళీ కోలుకొనేలేదు" అన్నది ఒక భాగ్యశాలి.

"పిల్లవాడికి ఏ యిబ్బందీ లేదుగా!" అని అడిగాడు.

"లేదు. బాగానే వున్నాడు"

అతను వొక్కక్షణం చుట్టూ పరికించి చూశాడు. తనతోటి వాళ్ళంతా అక్కడే వున్నారు. శివయ్య దూరంగా కాళ్ళు ముడుచుకొని కూర్చుని వున్నాడు. పిల్లవాడిని చేతులలో పెట్టుకొని వోదారుస్తున్నాడు ముసలయ్య. ముఖాన గుడ్డ కప్పుకొని శవంపక్కనే కూర్చొని వున్నాడు వెంకన్న ఆమె. మంచితనం అప్పుడప్పుడే వాళ్లకి అర్థం అవుతున్నట్లుంది.

ఎవరో "దహన ప్రయత్నాలు చెయ్యడం మంచిది" అన్నారు.

పాపారావు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు ఆ క్షణం అతనిని చూస్తే అందరికి భయమేవేసింది. ముసలయ్య పిల్లవాణ్ణి దించి నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళి "ఏమంటావ్ మరి?" అన్నాడు.

"ఆమెకు ఇక్కడ దహనం జరగటానికి వీల్లేదు" అన్నాడు పాపారావు. అతని గొంతు దేవాలయంలోని గంటలకుమల్లే ఖంగున మ్రోగింది.

అతను బయటకు వెళ్ళి వొక ఒల్లబండి తీసుకువచ్చాడు. క్షణంలో దానికి గుడిశె కప్పాడు. శవాన్ని ఆ గుడిసెలో పెట్టాడు. చంటివానిని ఎత్తుకొని బండి ఎక్కాడు.

"పోనివ్వు" అన్నాడు బండివాడితో.

అతను అడిగిందానికి సహాయం చెయ్యటంతప్ప ఎవ్వరూ పెదవి కదల్చలేదు. బండి వెళుతుంటే నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డారు.

బండి కాంతమ్మ అత్తవారి వూరు వెళ్ళి ఆమె ఇంటిముందు ఆగింది. ఎవ్వరో బంధువులు వచ్చారని తలుపు తీసుకొని గబగబా బయటకు వచ్చాడు కాంతమ్మ మొగుడు. నిలువుగుడ్లు వేసి జూస్తూ నిలబడ్డాడు. పాపారావు టూకీగా విషయం చెప్పాడు. "నువ్వెప్పటికైనా తిరిగి ఒస్తా వనుకున్నాగాని, ఇట్లా వస్తావని అనుకోలేదు కాంతం" అని బోరున ఏడ్చా డతను.

కర్మకాండ ముగిసింతర్వాత, పిల్లవాడిసంగతి ప్రశ్నకు వచ్చింది - 'పిల్లవాణ్ణి ఎవ్వరు పెంచాలి?' అని. కాంతమ్మ భర్తదికూడా ఆడ దిక్కు లేని సంసారమే. ఆ కారణంవల్ల గానీ పిల్లవాడి తండ్రి పాపారావనే నమ్మిగానీ, ఊళ్లో పెద్దలు ఆ భారం పాపారావుమీద వేశారు.

అతను మనసారా ఆ భారం మొయ్యటానికి అంగీకరించాడు. మొదట్లో ఇందుకుకాంతమ్మ భర్త అంగీకరించలేదుగాని, పెద్దల సలహామీద పాపారావు యిష్టానికి ఒదిలివేశాడు.

దినం పూర్తయింది. పిల్లవాణ్ణి తీసుకొని పాపారావు టౌనుకు బయలుదేరాడు. ఊరి పొలిమేరదాకా సాగనంపాడు కాంతమ్మ భర్త. అప్పుడప్పుడూ వచ్చి చూచిపోతానని చెప్పి వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

పిల్లవాణ్ణి పొత్తిగుడ్డల్లో పెట్టుకొని ముందుకు నడిచాడు పాపారావు. 'పుట్టబోయే పిల్లవాణ్ణి నేనే పెంచుకుంటాను' అని తాను అన్నప్పుడు 'ఆ మాట అన్నావ్, బాగుంది' అన్న కాంతమ్మ మాటలు జ్ఞాపకం వచ్చి అతని ఒళ్ళు ఉప్పొంగింది.